సాక్షి నిజామాబాద్


మంగళవారం । 18 । మార్చి । 2025



అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు

ప్రజావాణికి ప్రాధాన్యమిస్తూ అర్జీలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు.

- 8లో ▸





వాతావరణం

ఉదయం ఈదురుగాలులు వీస్తాయి.
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.
పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.
రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నిజామాబాద్ నుంచి సిద్దిపేటకు బస్సు సర్వీసులు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నుంచి కామారెడ్డి మీదుగా సిద్దిపేటకు బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు నిజామాబాద్–2 డిపో మేనేజర్ సాయన్న ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్ బస్సులను నడుపుతున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బస్సులు బయలుదేరు వేళలు:

నిజామాబాద్ నుంచి: 05.45, 6.30, 7.15, 14.15, 15.15, 15.45

సిద్దిపేట నుంచి : 9.30, 10.15, 11.00, 18.00, 19.00, 19.30

'ఇంటర్'లో 831 మంది గైర్హాజరు

- ఒకరిపై మాల్‌ప్రాక్టీస్ కేసు

నిజామాబాద్ అర్బన్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎకనామిక్స్, ఫిజిక్స్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 20,110 మంది విద్యార్థులకు 19,279 మంది హాజరుకాగా, 831 మంది గైర్హాజరయ్యారు. డిచ్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఓ విద్యార్థిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు చేసినట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు.

పరీక్షల సామగ్రిపై నిర్లక్ష్యం

- ఎమ్మార్సీ ఆవరణలో జవాబు పత్రాల బుక్‌లెట్‌లు



నిజామాబాద్ అర్బన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలంటేనే పకడ్బందీ ప్రణాళిక ఉంటుంది. కానీ, జిల్లాలో అలాంటిదేమీ కనిపించడం లేదు. అందుకు నిదర్శనమే.. పాత డీఈవో కార్యాలయంలోని ఎమ్మార్సీ ఆవరణలో బహిరంగంగా పారవేసిన జవాబు పత్రాలు, సామగ్రి. ఎంతో జాగ్రత్తగా, రహస్యంగా ఉంచాల్సిన సామగ్రిపై అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. అందులోని ఏ ఒక్క జవాబుపత్రం మాయమైనా విద్యార్థులకు ఇబ్బందిగా మారే అవకాశం ఉంటుంది.

ఎండిన వరి @790 ఎకరాలు

భూగర్భ జలమట్టాలు తగ్గిపోతుండడంతో ప్రస్తుత సీజన్‌లో వరి పంటలు ఎండిపోతున్నాయి. జిల్లా వ్యవసాయ శాఖ అధికారిక లెక్కల ప్రకారం ఈ సీజన్‌లో జిల్లాలో 790 ఎకరాల్లో వరి పంట ఎండిపోయింది. అదేవిధంగా మరో 602 ఎకరాల్లో వరి పంట ఎండిపోయే దశకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. అయితే అనధికారిక లెక్కల ప్రకారం మరో 2 వేల ఎకరాల్లో వరి పంటలు ఎండిపోయినట్లు తెలుస్తోంది. జిల్లాలో వరి సాగు 4.20 లక్షల ఎకరాల మేర ఉంటుంది.

- నీరందక ఎండిపోయే దశకు చేరుకుంటున్న పంట 602 ఎకరాలు
- అనధికారిక లెక్కల ప్రకారం మరో రెండువేల ఎకరాల్లో నష్టం
- పడిపోతున్న భూగర్భ జలాలు
- 11 మీటర్ల లోతుల్లోకి జిల్లాలో సగటు భూగర్భ జలాలు




ఆర్మూర్ మండలం చేపూర్ శివారులో నీరందని వరి పంట

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలోని నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలోని సిరికొండ, ఇందల్వాయి, ధర్పల్లి, డిచ్‌పల్లి, బాల్కొండ నియోజకవర్గంలోని భీమ్‌గల్ మండలాల్లో వరి పంటలు ఎక్కువగా ఎండిపోతున్నాయి. భూగర్భ జలమట్టాలు రూరల్ నియోజకవర్గంలో రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. దీంతో బోరు మోటార్లు ఎత్తిపోతున్నాయి. తాజా అంచనాల ప్రకారం సిరికొండ మండలంలో సుమారు 350 ఎకరాలు, ధర్పల్లి మండలంలో 250 ఎకరాలు, డిచ్‌పల్లి మండలంలో 200 ఎకరాలు, ఇందల్వాయి మండలంలో 200 ఎకరాలు, నిజామాబాద్ రూరల్ మండలంలో 100 ఎకరాలు, జక్రాన్‌పల్లి మండలంలో 200 ఎకరాలు, మోపాల్ మండలంలో 100 ఎకరాల్లో వరి పంట ఎండిపోయినట్లు అంచనా.

■ బోధన్ నియోజకవర్గంలోని నిజాంసాగర్ చివరి ఆయకట్టు ప్రాంతం నవీపేట మండలంలోని నిజాంపూర్, లింగాపూర్ గ్రామాల శివారులో సుమారు 500 ఎకరాలు, రాంపూర్ శివారులో 400 ఎకరాల మేర ప్రాజెక్ట్ నీరు అందని పరిస్థితుల్లో వరి పంట ఎండిపోయే దశలో ఉంది. ఈ గ్రామాలకు డి–50 ఉప కాలువ ద్వారా నీటి పారకం ఉంటోంది. గతంలో నాలుగు విడతలుగా నీరు వదిలిన ప్పటికీ చివరి ఆయకట్టుకు అందలేదు. విద్యుత్ బోరు బావులు లేవు. నిజాంసాగర్ నీటి ఆధారంగానే పంటలు సాగు చేస్తున్నారు.

■ ఆర్మూర్ మండలం చేపూర్ శివారులో భూగర్భ జలాలు తగ్గిపోవడంతో సాగునీరందక వరి పంట ఎండిపోతోంది. వాణిజ్య పంటలు పండించే ఆర్మూర్ ప్రాంత రైతులు నేల స్వభావాన్ని బట్టి వరి పంటను సైతం యాసంగిలో సాగు చేస్తున్నారు. ఇదిలా ఉండగా నిజాంసాగర్ ప్రాజెక్టు చివరి ఆయకట్టు ప్రాంతం కావడంతో 40 ఏళ్లుగా సాగునీరందడం లేదు. గుత్ప ఎత్తిపోతల పథకం నీరు సైతం ఈ గ్రామానికి తగినంతగా అందకపోవడంతో వరి పంట ఎండిపోయి రైతులు నష్టపోతున్నారు.

■ భూగర్భ జల మట్టాలకు సంబంధించి భౌగోళికంగా నిజామాబాద్ జిల్లాలో 82 ఫీజో మీటర్లను ఏర్పాటు చేశారు. ఇందులో 35 ఫీజో మీటర్లలో 10 మీటర్ల లోపు నీటిమట్టాలు ఉండగా, 24 ఫీజో మీటర్లలో 10 నుంచి 15 మీటర్లలోపు నీటిమట్టాలు ఉన్నాయి. అలాగే 12 ఫీజో మీటర్లలో 15 నుంచి 20 మీటర్లలోపు నీటి మట్టాలు ఉన్నాయి. మరో 11 ఫీజో మీటర్లలో 20 మీటర్లపై నీటి మట్టాలు ఉన్నట్లు భూగర్భజల శాఖ సేకరించిన రికార్డుల్లో నమోదైంది. కాగా జిల్లాలో ప్రస్తుతం భూగర్భ జలాలు సరాసరిగా 11 మీటర్ల లోతులో ఉన్నాయి.



జిల్లాలో భూగర్భ జలమట్టాల తాజా మ్యాప్

ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం

ఈసారి వేర్వేరుగా కొనుగోళ్లు

- జిల్లా వ్యాప్తంగా 622 కేంద్రాలు
- సన్నరకానికి 429, దొడ్డురకానికి 193 సెంటర్లు
- 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- రేపు సంబంధిత శాఖలతో సమన్వయ సమావేశం



సుభాష్‌నగర్ : జిల్లాలో వరి పంట చేతికొస్తుంది. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఈసారి సన్న, దొడ్డు రకాలకు వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేయనుంది. జిల్లా వ్యాప్తంగా సన్నరకానికి 429, దొడ్డు రకం ధాన్యానికి 193 కేంద్రాల ఏర్పాటుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఏప్రిల్ 1 నుంచి కొనుగోళ్లు ప్రారంభించేలా సర్వం సన్నద్ధం చేస్తున్నారు.

4.20 లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లా వ్యాప్తంగా రైతులు 4.20 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. 3.75 లక్షల ఎకరాల్లో సన్న రకాలు, మిగతా 45 వేల ఎకరాల్లో ఇతర రకాలు పండించారు. మొత్తం 11.85 లక్షల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి అంచనా వేయగా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా 7 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకోసం 622 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. జిల్లాను 10 సెక్టార్లుగా విభజించి ధాన్యం రవాణా చేపట్టనున్నారు. గత వానాకాలం సీజన్‌లో దక్కించుకున్న కాంట్రాక్టర్లనే ఈసారీ కొనసాగించనున్నారు. సేకరించిన ధాన్యాన్ని సుమారు 250 రైస్‌మిల్లులకు కేటాయించనున్నారు. ధాన్యం సేకరణకు దాదాపు కోటీ 70 లక్షల గన్నీబ్యాగులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే 55 లక్షల గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండగా, మిగతా వాటిని తెప్పిస్తున్నారు.

సన్నరకాలకు బోనస్!

రాష్ట్ర ప్రభుత్వం సన్నరకాల సాగును ప్రోత్సహించేందుకు గత సీజన్‌లో క్వింటాలుకు రూ.500 బోనస్ ప్రకటించిన విషయం తెలిసిందే. వానాకాలంలో 47,811 మంది రైతులకు రూ.158.63 కోట్ల బోనస్‌ను వారి ఖాతాల్లో జమ చేసింది. యాసంగిలోనూ బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో 85 శాతం మేర రైతులు సన్నరకాన్ని సాగుచేశారు. సన్న రకం ధాన్యాన్ని గుర్తించేందుకు మార్కెటింగ్ శాఖ ద్వారా ఒక్కో సెంటర్‌కు ధాన్యం కొలిచే యంత్రాన్ని సరఫరా చేయనున్నారు. ఇదిలా ఉండగా సన్న, దొడ్డురకం కేంద్రాలను వేర్వేరుగా ఏర్పాటు చేయనుండడంతో రైతుల్లో బోనస్ ఆశలు రేకెత్తుతున్నాయి.

రేపు కో ఆర్డినేషన్ సమావేశం

ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగేందుకు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ నేతృత్వంలో ఈ నెల 19న సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వ్యవసాయ, సహకార, పౌరసరఫరా, రెవెన్యూ, మెప్మా, డీఆర్డీవో, రవాణా, ఇతర అన్నిశాఖల జిల్లాస్థాయి అధికారులతోపాటు క్షేత్రస్థాయి ఉద్యోగులు, సిబ్బంది సమావేశంలో పాల్గొననున్నారు.

ఏర్పాట్లు పూర్తయ్యాయి



జిల్లాలో ధాన్యం సేకరణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన వెంటనే కొనుగోళ్లు ప్రారంభిస్తాం. సన్న, దొడ్డురకాలకు వేర్వేరు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. అన్నిశాఖల అధికారుల సమన్వయం, రైతుల సహకారంతో యాసంగి సీజన్‌లో కొనుగోళ్లను విజయవంతం చేస్తాం.

– కిరణ్‌కుమార్, అదనపు కలెక్టర్

సాంగ్లీ ధర ఇందూరులోనూ ఇవ్వాలి

- బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



మోర్తాడ్(బాల్కొండ): మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్‌లో పసుపు పంటకు లభిస్తున్న ధరనే నిజామాబాద్ మార్కెట్‌లోనూ అమలయ్యేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి కోరారు. సోమవారం అసెంబ్లీ జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. నిజామాబాద్ మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడడంతో ఎంత నాణ్యత ఉన్నా పసుపు పంటకు ధర లభించడం లేదన్నారు. ఇదే రకం పసుపును రైతులు సాంగ్లీ మార్కెట్‌కు తరలిస్తే క్వింటాలుకు రూ.13వేల నుంచి రూ.14వేల ధర పలుకుతుందని వెల్లడించారు. నిజామాబాద్‌లో మొదట్లో క్వింటాలు పసుపునకు రూ.12వేల ధర లభించగా ప్రస్తుతం రూ.8వేలు మాత్రమే దక్కడంతో రైతులు నష్టపోతున్నారని వాపోయారు. ఇది ఎనిమిది నియోజకవర్గాల రైతుల సమస్య అని ఆయన చెప్పారు.

పర్యాటక అభివృద్ధిలో సముచిత స్థానం

- మంత్రి జూపల్లి కృష్ణారావు



నిజామాబాద్ అర్బన్: పర్యాటక అభివృద్ధిలో అన్ని జిల్లాలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. సోమవారం శాసనసభలో ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌లో పర్యాటక అభివృద్ధిపై ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి జూపల్లి సమాధానమిచ్చారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో పర్యావరణ పర్యాటక అభివృద్ధిలో భాగంగా ఉమ్మెడ గ్రామ సమీపంలో 1.20 ఎకరాలు, జలాల్‌పూర్ గ్రామ పరిధిలో 3 ఎకరాల భూమిని ప్రభుత్వం తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థకు అప్పగించినట్లు వెల్లడించారు. శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ ప్రాంత పర్యాటకాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తామని మంత్రి పేర్కొన్నారు.



'ఓయూ'కి సురవరం పేరు పెట్టాలి

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



సుభాష్‌నగర్ : ఉస్మానియా యూనివర్సిటీకి తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ప్రాణం పోసిన సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. తెలుగు యూనివర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరు తొలగించి సురవరం ప్రతాపరెడ్డి పేరు మార్పుపై అసెంబ్లీలో పెట్టిన తీర్మానంపై సోమవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. పేరు మార్పు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని సూచించారు. పొట్టి శ్రీరాములు కేవలం భాషాపరమైన ఉద్యమమే కాకుండా దళితుల హక్కుల కోసం, స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీతో కలిసి పనిచేశారని గుర్తుచేశారు. ఆయన పేరు తొలగిస్తే ఆర్యవైశ్య జాతి మొత్తం ఉద్యమానికి సిద్ధంగా ఉందన్నారు.

పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి



ఆర్మూర్ : గోదావరి పరీవాహక ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. పురాతన ఆలయాలున్న ఉమ్మెడ, కొండూరు, చిన్న యానాం వంటి ప్రాంతాలతో పాటు గోదావరి తీరాన భూములను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయడంతో చాలా మందికి ఉపాధి లభిస్తుందన్నారు. జిల్లాకు బాసర పుణ్యక్షేత్రం అతి దగ్గర ఉండటంతో త్వరితగతిన అభివృద్ధి చెందుతుందన్నారు. ఆర్మూర్ పట్టణంలోని నవనాథుల సిద్ధుల గుట్ట అభివృద్ధి కోసం గతంలో దేవాదాయ శాఖ మంత్రికి విన్నవించినా స్పందించలేదని ఆరోపించారు. కొడంగల్‌తో సమానంగా కాకున్నా కొంతైనా నిధులు తమ నియోజకవర్గానికి ఇవ్వాలన్నారు. జక్రాన్‌పల్లి విమానాశ్రయ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు.

దివ్యాంగుల సేవలను బాధ్యతగా భావించాలి

- జిల్లా విద్యాశాఖాధికారి అశోక్

నిజామాబాద్ అర్బన్ : దివ్యాంగుల సేవను తల్లిదండ్రులు, సహిత విద్యా విభాగం ఉద్యోగులు బరువుగా కాకుండా బాధ్యతగా భావించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పార్శి అశోక్ అన్నారు. దివ్యాంగ విద్యార్థులకు అన్నిరంగాల్లో సమాన అవకాశాలు ఉండడంతోపాటు పదో తరగతి పాస్ మార్కుల విషయంలోనూ ప్రభుత్వం మినహాయింపునిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని న్యూ ఎన్జీవోస్ కాలనీలో సోమవారం దివ్యాంగ విద్యార్థులకు సహాయ పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సహాయ ఉపకరణాలు అందజేస్తున్న ఆలింకోను డీఈవో అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం, ఆలింకో నిధులు రూ. 23,28,379తో విలువైన పరికరాలను పంపిణీ చేస్తున్నామన్నారు. దివ్యాంగ విద్యార్థులకు మంజూరైన స్టైఫండ్, అలవెన్సులు త్వరలోనే బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు ప్రకాశ్, లింబాద్రి స్వామి, సంతోష్, శేఖర్, నాగేశ్ గౌడ్, జలంధర్, కిషన్ సాగర్, ఆనంద్, కిషన్, లక్ష్మణ్, ప్రసాద్, స్పెషల్ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగ విద్యార్థులకు పరికరాలను పంపిణీ చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్

ఉపాధికి ఊతం.. రాజీవ్ యువ వికాసం

- కొత్త పథకానికి శ్రీకారం చుట్టిన సర్కారు
- నిరుద్యోగ యువతకు రూ.లక్ష నుంచి రూ.4లక్షల వరకు సబ్సిడీ రుణాలు
- ఆన్‌లైన్‌లో ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ



తీసుకునే రుణం	వర్తించనున్న సబ్సిడీ
రూ.లక్ష	80 శాతం
రూ. 2 లక్షలు	70 శాతం
రూ.3 లక్షల నుంచి	
రూ.4 లక్షల వరకు	60 శాతం

దరఖాస్తు చేసుకునేందుకు సందర్శించాల్సిన వెబ్‌పోర్టల్
https://tgobmmsnew.cgg.gov.in

నిజామాబాద్ అర్బన్ /మోర్తాడ్(బాల్కొండ): యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉద్దేశించిన రాజీవ్ యువ వికాసం పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. డిగ్రీ ఉత్తీర్ణులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల నిరుద్యోగ యువతకు ఈ ఆర్థిక రుణాన్ని అందించనుంది. ప్రభుత్వం అందించే ఈ రుణంతో నిరుద్యోగులు తమకు నచ్చిన వ్యాపారాన్ని నిర్వహించుకునే అవకాశం కల్పిస్తోంది. ఏప్రిల్ 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించి అనంతరం అర్హులను ఎంపిక చేయనున్నారు. అందులో భాగంగా ఒక్కో నియోజకవర్గానికి 5,000 మందిని ఎంపిక చేసి జూన్ 2న రుణాలు పంపిణీ చేయనున్నారు. పథకానికి సంబంధించిన పూర్తి విధి విధానాలు మంగళవారం అధికారులు వెల్లడించనున్నట్లు తెలిసింది.

కార్పొరేషన్‌లకు జీవం

ఉమ్మడి రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాలను అందించేవారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత కార్పొరేషన్‌లకు రాయితీ కోసం నిధులను కేటాయించకపోవడంతో సబ్సిడీ రుణాలకు బ్రేక్ పడింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక విడతలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళితబంధు, బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీబంధు, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలను అందించినా పూర్తిస్థాయిలో పథకాలు అమలు కాలేదు. ఫలితంగా ఆయా కార్పొరేషన్లు డీలా పడ్డాయి. తాజాగా యువతకు రూ.లక్ష నుంచి రూ.4లక్షల వరకూ రాయితీ రుణాలను అందించేందుకు కొత్త పథకానికి జీవం పోస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

యువతకు మంచి అవకాశం



రాజీవ్ యువ వికాసం పథకంతో యువతకు మంచి అవకాశం కల్పించినట్లు అవుతుంది. గతంలో రాయితీ రుణాలకు మంగళం పలకడంతో అనేక మంది నిరుద్యోగులకు స్వయం ఉపాధి లభించక వలస వెళ్లారు. ఇప్పుడు ఉన్న ఊరిలోనే సొంతంగా వ్యాపారం చేసుకోవచ్చు.

– తక్కూరి సతీశ్, కాంగ్రెస్ నాయకుడు, మోర్తాడ్

ఎంపికలో పారదర్శకత లోపించవద్దు



లబ్ధిదారులను ఎంపిక చేసే విషయంలో పారదర్శకత లోపించకూడదు. అర్హులైన వారికే ప్రభుత్వ పథకాలు అందించాలి. నిరుద్యోగులు ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. అధికార పార్టీ నాయకుల జోక్యం లేకుండా చూడాలి.

– పుప్పాల నరేశ్, బీజేపీ మండల అధ్యక్షుడు, మోర్తాడ్

క్లుప్తంగా

ఆభరణాలు ఎత్తుకెళ్లిన నిందితుల రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

నిజాంసాగర్(జుక్కల్): మహిళను నమ్మించి నగలు ఎత్తుకు వెళ్లిన ఆటో డ్రైవర్ సుందర్‌రాజుతోపాటు వడ్డే లక్ష్మిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు బాన్సువాడ రూరల్ సీఐ రాజేష్ సోమవారం తెలిపారు. వివరాలు ఇలా.. సంగారెడ్డి జిల్లా మార్డి గ్రామానికి చెందిన మ్యాతరి భూమవ్వ ఆదివారం అచ్చంపేట వెళ్లడానికి నిజాంసాగర్ బస్టాండ్ సమీపంలోని రోడ్డుపై నిల్చుంది. ఆటోలో వచ్చిన సుందర్‌రాజుతోపాటు వడ్డె లక్ష్మి కలిసి భూమవ్వను అచ్చంపేటకు తీసుకెళ్తామని నమ్మించి ఆటోలో ఎక్కించుకున్నారు. నిర్మానుష్య ప్రదేశంలో ఇద్దరు కలిసి భూమవ్వ మెడలోని రెండు తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకువెళ్లారు. సోమవారం బొగ్గు గుడిసె చౌరస్తా వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటో డ్రైవర్ పారిపోతుండగా వెంబడించి పట్టుకున్నారు. వారిని విచారించగా భూమవ్వ వద్ద చోరీకి పాల్పడినట్లు తెలిపారు. వెంటనే వారి వద్ద నుంచి పోలీసులు ఆభరణాలను స్వాధీనం చేసుకొని, వారిని రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. నిజాంసాగర్ ఎస్సై శివకుమార్, కానిస్టేబుళ్లు శ్యామ్, మహేష్‌లను సీఐ అభినందించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఎడపల్లి(బోధన్): మండలంలోని ఠాణాకలాన్ గ్రామ శివారులోని నిజాంసాగర్ ప్రాజెక్టు డి-46 కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. సోమవారం కాలువలో మృతదేహాన్ని గుర్తించి ఒడ్డెపల్లి గ్రామ కార్యదర్శి రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

హెచ్చరిక ప్రకటన

నా క్లయింట్లు శ్రీమతి జాస్తి వాణి కుమారి, లోకం రాహుల్ మరియు లోకం నవీన్ కుమార్ గార్లు లేట్ లోకం సాంబశివరావు గారి యొక్క న్యాయ వారసులని ఐదుమూలంగా సాధారణ ప్రజానీకానికి తెలియజేయడమైనది. నమ్మదగిన ఆధారాల ద్వారా వారికి తెలియవచ్చినది ఏమనగా, మోదుగుల అనిల్ కుమార్ తండ్రి మోదుగుల రామకృష్ణ రెడ్డి తహశీల్దారు -వర్నితోపాటు కుర్మిండ్ల లక్ష్మణ్‌తో కలిసి నిజామాబాద్ జిల్లా, వర్ని మండలం, తగిలేపల్లి గ్రామం వద్ద గల ఎ.0-17 గుంటల విస్తీర్ణపు సర్వే నం. 183/A2 లోని భూమికి సంబంధించి షమ్ సేల్ డీడ్ సృష్టించారు. సదరు వ్యక్తికి శ్రీ లోకం సాంబశివరావు గారితో ఎటువంటి బంధుత్వం లేదు. నా క్లయింట్లు లోకం సాంబశివరావు గారి యొక్క భార్య మరియు పిల్లలు, వీరు మినహా, మరో వ్యక్తి పైన తెలిపిన భూముల్లో ఎటువంటి హక్కు కలిగి లేరు. కుర్మిండ్ల లక్ష్మణ్ సాధారణ ప్రజలకు తప్పుదు విధంగా తెలియజేస్తూ పైన తెలిపిన భూమిని అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇంటి నం. 6-5 గల దానికి కూడా గజివరపు వీరవేణి ద్వారా ఆమె కుమారుడు గజివరపు రాజు పేరున డాక్యుమెంటు నం.8204 ఆఫ్ 2024 ప్రకారం షమ్ డాక్యుమెంట్ సృష్టించబడినదని కూడా నా క్లయింట్లకు తెలియవచ్చినది. సదరు మహిళా మరియు ఆమె కుమారుడు లేట్ లోకం సాంబశివరావు గారికి సంబంధించిన వారు కారు. కుర్మిండ్ల లక్ష్మణ్ ద్వారా పొందిన సేల్ డీడ్ షమ్ సేల్ డీడ్, ఈ డాక్యుమెంటు ద్వారా, అతను సదరు భూమిపై ఏ విధమైన టైటిల్ పొందజాలరు. మోదుగుల అనిల్ కుమార్ ద్వారా సృష్టించబడిన కల్పిత విల్ డీడ్పై ఆధారపడి ఏ విధమైన మార్పిడి ఉత్తర్వులు లేదా వారసత్వ ప్రొసీడింగ్స్ స్వీకరించరాదని తెలియజేస్తూ MRO వర్ని, RDO బోధన్ గార్లకు నా క్లయింట్లు ఇప్పటికే లీగల్ నోటీసు జారీచేశారు. డాక్యుమెంటు నం. 8204 ఆఫ్ 2024 ద్వారా, శ్రీ గజివరపు రాజు ఏవిధమైన విక్రయ హక్కు మూలం లేదా హక్కు పొందజాలరు, సదరు డాక్యుమెంటు షమ్ డాక్యుమెంటు మరియు అది మా ఆస్తిని కొట్టేయడానికి సృష్టించబడినది.

నా క్లయింట్లు తదుపరిగా సాధారణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా, వారు లేట్ లోకం సాంబశివరావు గారి నుండి, నిజామాబాద్ జిల్లా, వర్ని మండలం, కోటయ్య క్యాంప్, నం.6-5 గల ఇంటితో పాటు, నిజామాబాద్ జిల్లా, వర్ని మండలం, తగిలేపల్లి గ్రామం వద్దగల సర్వే నం. 183/A1లో విస్తీర్ణం ఎ.0.17 గుంటలు, 183/A2లో విస్తీర్ణం ఎ.0.17 గుంటలు, 370/AA1/1లో విస్తీర్ణం ఎ.1.05 గుంటలు, సర్వే నం.389లో విస్తీర్ణం ఎ.4.12 గుంటలు, 571 A/1 లో విస్తీర్ణం ఎ.2.13 గుంటలు, 528లో విస్తీర్ణం ఎ.0.17 గుంటలు, 225/2 A3లో విస్తీర్ణం ఎ.0.23 గుంటలు, మొత్తం విస్తీర్ణం ఎ.9-23 గుంటలు గల భూములను వారసత్వంగా పొందారు, వారు "Class-1" న్యాయ వారసులుగా ఉన్నారు. ఇతర వ్యక్తులకు ఏ విధమైన హక్కు లేదు.

పైన తెలిపిన భూములు మరియు ఇంటి ఆస్తికి సంబంధించి మోదుగుల అనిల్ కుమార్, కుర్మిండ్ల లక్ష్మణ్, గజివరపు రాజు లేదా ఏవరైనా ఇతర వ్యక్తితో ఏ విధమైన లావాదేవీ చేయరాదని సాధారణ ప్రజలను హెచ్చరించడమైనది. ఒకవేళ పైన తెలిపిన భూములు మరియు ఇంటికి సంబంధించి పై సదరు వ్యక్తులతో ఎవరైనా ఏదైనా లావాదేవీ చేసుకున్నట్లయితే, అది వారి సొంత నష్టం మేరకు చేసుకోవచ్చు మరియు కొనుగోలుదారు ఏవిధమైన టైటిల్ పొందజాలరు. ఒకవేళ ఎవరైనా ఏదైనా క్లెయిమ్ కలిగి ఉంటే, అతను/ఆమె ఈ హెచ్చరిక ప్రకటన తేది నుండి '5' రోజుల్లోగా డాక్యుమెంటరీ రుజువుతో దిగువ సంతకందారును సంప్రదించవలెను.

సం/- టి.శ్రీధర్‌రెడ్డి, న్యాయవాది
3-5-20, నవజీవన్ ఉమెన్స్ కాలేజ్ ఎదురుగా, రాంకోఠి, హైదరాబాద్. సెల్ నం. 9440059706

'ప్రజావాణి' అర్జీలను పెండింగ్‌లో పెట్టొద్దు



కలెక్టరేట్‌లో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్, తదితరులు

నిజామాబాద్‌అర్బన్: ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల అర్జీలను సత్వరమే పరిష్కరించాలని, పెండింగ్‌లో పెట్టవద్దని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. నగరంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరం(కలెక్టరేట్)లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 64 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌తో పాటు, ట్రెయినీ కలెక్టర్ సంకేత్, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్‌లకు విన్నవిస్తూ దరఖాస్తులు అందజేశారు. కాగా, అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు.

ఇళ్లు ఖాళీ చేయమంటున్నారు



నగరంలోని గంగాస్థాన్ ఫేస్-2 వద్ద పూలాంగ్ వాగు పక్కన నివాసం ఉంటున్నాం. గత కొన్నేళ్లుగా ఇక్కడే ఉంటున్నాం. ప్రస్తుతం అధికారులు స్థలాన్ని ఖాళీ చేయాలని నోటీసులు అందించారు. ఉన్నఫలంగా వెళ్లిపోమంటే ఎక్కడికి వెళ్లాలి. తక్షణమే మాకు ఇళ్లు కేటాయించాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేశాం. -గంగాస్థాన్ వాసులు, నిజామాబాద్

ఇళ్లస్థలాలు ఇప్పించాలి



ఎస్సారెస్పీ ముంపు ప్రాంతంలో ఆర్మూర్ మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన తాము భూములు కోల్పోయాం. బాధితులు సుమారు 60 మంది గ్రామస్తులు ఉండగా సమస్యను అధికారులకు విన్నవించాం. ప్రభుత్వం స్పందించి కోటార్మూర్ శివారులోని స్థలంలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతున్నాం. -ఖానాపూర్ గ్రామస్తులు

పింఛన్ ఇప్పించండి..



పెన్షన్ కోసం గత కొన్నేళ్లుగా అధికారులకు విన్నవించాను. అయినా అధికారులెవరూ స్పందించడం లేదు. ఇప్పటికైనా స్పందించి, సమస్యను పరిష్కరించి, పింఛన్ మంజూరు చేయాలి -జమున, నాందేవ్‌వాడ, నిజామాబాద్

నా కొడుకు చూడడం లేదు



నా కొడుకు నన్ను పట్టించుకోవడం లేదని ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశాను. ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేశాను. నా కొడుకును నా ఇంటి నుంచి వెళ్లగొట్టి ఇల్లు నాకు ఇప్పించండి. లేదంటే నా భార్య, నేను ఆత్మహత్య చేసుకుంటాం. -గంగారాం, ధర్మారం, డిచ్‌పల్లి మండలం

ఉద్యోగం ఇప్పించండి



నాకు డిచ్‌పల్లి ఏడవ బెటాలియన్‌లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించండి. గతంలో ఇక్కడ నేను పని చేశాను. తరువాత అధికారులు వెళ్లిపోమ్మన్నారు. ఉపాధి కోసం బెటాలియన్‌లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించండి. -లలిత, నడిపల్లి తండా, డిచ్‌పల్లి మండలం

తహసీల్దార్‌పై చర్య తీసుకోండి



నా సొంత భూమిని నవీపేట మండల తహసీల్దార్ మరొకరికి పట్టా చేయించారు. సర్వే నెంబర్ 289లో 37 గుంటల భూమిని ఇతరులకు అప్పగించారు. వెంటనే తహసీల్దార్‌పై చర్యలు తీసుకొని, నాకు న్యాయం చేయాలి. -కమలమ్మ, గాంధీనగర్, నవీపేట మండలం

అటవీ అధికారులు వేధిస్తున్నారు



కొన్నేళ్ల కిందట ప్రభుత్వం నాకు గ్రామ శివారులో ఐదు ఎకరాల భూమిని ఇచ్చింది. ప్రస్తుతం దీనిని సాగుచేసుకుంటుండగా ఇటీవల అటవీశాఖ అధికారులు వచ్చి భూమి అటవీ శాఖకు సంబంధించిందని వేధింపులకు గురిచేస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలి. - రామ్‌దాస్, దుబ్బాక, ధర్పల్లి మండలం

రైతు భరోసా ఇప్పించాలి



మోపాల్ మండలం నర్సింగ్‌పల్లి గ్రామంలో నాకు వ్యవసాయ భూమి ఉంది. అయినా నాకు గత కొన్నేళ్లుగా రైతు భరోసా రావడం లేదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతు భరోసా మంజూరు చేయాలి. -కిషన్, నర్సింగ్‌పల్లి, మోపాల్ మండలం

సెల్‌టవర్ నిర్మాణం ఆపండి



నగరంలోని బడాబజార్ వద్ద అనుమతి లేకుండా సెల్ టవర్ నిర్మాణం జరుగుతుంది. పనులు వెంటనే నిలిపివేయాలని కోరుతూ ఫిర్యాదు చేశాం. సెల్‌టవర్ నిర్మాణం చేపడుతున్న ఇంటికి కూడా అనుమతి లేదు. అధికారులు స్పందించాలి. -బడాబజార్ కాలనీవాసులు

ఉత్తమ పరిశోధనలతో వర్సిటీకి గుర్తింపు తేవాలి



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అంతర్జాతీయస్థాయి ఉత్తమ పరిశోధనలు చేసి తెలంగాణ యూనివర్సిటీకి మంచి గుర్తింపు తీసుకురావాలని వీసీ యాదగిరిరావు సూచించారు. తెయూ ఫార్మాస్యూటికల్ విభాగానికి చెందిన విద్యార్థులు వెన్నెల, కృష్ణప్రకాష్‌లు ఇటీవల తైవాన్‌లోని నేషనల్ డాంగువా యూనివర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశం పొందారు. ఈసందర్భంగా సోమవారం వీసీ, రిజిస్ట్రార్ వారిని అభినందించారు. అలాగే విద్యార్థులు అడ్మిషన్లు సాధించేందుకు కృషి చేసిన వాసం చంద్రశేఖర్, సత్యనారాయణరెడ్డి, శిరీషను వీసీ, రిజిస్ట్రార్ అభినందించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఇందల్వాయి: ఇందల్వాయి ఉన్నత పాఠశాలలో సోమవారం 2006-07 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 18ఏళ్ల తర్వాత వారంత కలుసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు. లోకాని గోపి, మారంపల్లి శ్రీకాంత్, అశోక్, సువర్ణ, స్వప్న, లావణ్య తదితరులు ఉన్నారు.

పసుపు ధరలో గోల్‌మాల్

■ జగిత్యాల్ జిల్లా మల్లాపూర్ మండలం మొగిలిపేట్‌కు చెందిన రైతు వంగ శేఖర్ నాలుగు రోజుల క్రితం నిజామాబాద్ మార్కెట్‌లో 12 క్వింటాళ్ల పసుపును విక్రయించాడు. ఒక్కో క్వింటాలుకు ఈనామ్ ప్రకారం రూ.10,006 ధర నిర్ణయించారు. పసుపును కొనుగోలు చేసిన వ్యాపారి మాత్రం ఒక్కో క్వింటాలుకు రూ.9,500లు మాత్రమే చెల్లిస్తానని స్పష్టం చేశారు. చేసేది లేక రైతు ఈనామ్ ధర కంటే తక్కువ ధరకే పసుపు విక్రయించాడు. ఫలితంగా రూ.6,072 నష్టపోయాడు. కమీషన్ ఏజెంట్‌కు మరో రూ.2,500ల చెల్లించాడు. అంటే వంగా శేఖర్‌కు తన పసుపును విక్రయించి రూ.8,572 తక్కువ పొందాడు. ఇది ఒక్క శేఖర్‌కు ఎదురైన నష్టమే కాదు. నిజామాబాద్ మార్కెట్‌లో పసుపును విక్రయించడానికి వెళ్లిన ఎంతో మంది రైతులకు ఇదే పరిస్థితి ఎదురవుతుండటంతో తీవ్రంగా నష్టపోతున్నారు.

- ఈనామ్ ట్రేడింగ్‌లో ఒక ధర, మాన్యువల్‌లో మరో ధర
- రైతులను నమ్మించి మోసగిస్తున్న పసుపు వ్యాపారులు

మోర్తాడ్(బాల్కొండ): నిజామాబాద్ మార్కెట్‌లో పసుపు ధరలో గోల్‌మాల్ జరుగుతోంది. ఈనామ్ ట్రేడింగ్‌లో ఒక ధర, మాన్యువల్‌లో మరో ధర ఉండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అయినా మార్కెటింగ్ శాఖ అధికారులు మౌనం వహించడం ఎన్నో సందేహాలకు తావిస్తుంది.

వ్యాపారులు చెప్పిందే ధర..

నిజామాబాద్ మార్కెట్ వరుస సెలవుల తరువాత సోమవారం ప్రారంభమైంది. కానీ ఈనామ్‌తో సంబంధం లేకుండానే గంజ్‌లో వ్యాపారులు ధర నిర్ణయించారు. పసుపు నాణ్యతను బట్టి కొమ్ముకు రూ.10వేల నుంచి రూ.12వేలు, మండకు రూ.8వేల నుంచి రూ.9,800ల వరకూ ధర చెల్లించారు. ఇటీవల ఈనామ్ ప్రకారం ఒక ధర మార్కెట్‌లో మరో ధర వల్ల రైతులు ఆందోళన చేపట్టగా తాజాగా ఈనామ్‌ను పరిగణలోకి తీసుకోలేదని తెలుస్తుంది. రైతులకు ఆశించిన ధర లభించక తీవ్రంగా నష్టపోతున్నారు. ఒక్కో ఎకరం పసుపు సాగుకు రైతులు రూ.1.15లక్షల నుంచి రూ.1.30లక్షల వరకు పెట్టుబడులు పెడుతున్నారు. పసుపు తవ్వడం, ఉడికించడం, ఆరబెట్టి పాలిషింగ్ చేయడం కోసం అదనంగా రూ.50వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ఒక్కో ఎకరానికి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి రావడంతోపాటు, క్వింటాలు ధర కనీసం రూ.12వేలకు మించి ఉంటేనే రైతుల శ్రమకు తగ్గ ఫలితం లభిస్తుంది. కానీ ప్రస్తుత ధర రూ.10వేల లోపు ఉండటం, దిగుబడి తక్కువగా రావడంతో రైతులకు తీవ్రంగా నష్టం ఏర్పడుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పసుపు సాగుపై చిత్తశుద్ధి లేకపోవడంతోనే పసుపు రైతులకు ప్రోత్సాహం కరువైందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి పసుపు సాగు అంశంపై దృష్టిసారించి మద్దతు ధర నిర్ణయించడం, సాగు ఖర్చులు తగ్గేలా అధ్యయనం చేయడంపై చొరవ తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.



ఒక వ్యాపారి రశీదుపై మొదట్లో ఒక ధర రాసి అది కొట్టివేసి తక్కువ ధర రాసిన దృశ్యం

మద్దతు ధరనే కీలకం..



నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల్ జిల్లాల్లోని నేలలు పసుపు సాగుకు ఎంతో అనువైనవి. పసుపు సాగు చేసే రైతులను ప్రోత్సహించాలంటే మద్దతు ధర నిర్ణయమే కీలకమైంది. ప్రభుత్వాలు మద్దతు ధర నిర్ణయించి పక్కాగా అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలి. - డాక్టర్ కిషన్‌రెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్త

ఇంటి నిర్మాణంపై తెగని పంచాయితీ

- పనులను అడ్డుకున్న జక్రాన్‌పల్లి వీడీసీ
- హైకోర్టును ఆశ్రయించిన బాధితురాలు

ఖలీల్‌వాడి: జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో ఓ ఇంటి నిర్మాణం విషయమై స్థల యజమాని, వీడీసీల మధ్య పంచాయితీ ఏడాదిగా కొనసాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపడుతున్నారంటూ వీడీసీ సభ్యులు పనులను అడ్డుకోగా, బాధితురాలు ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. జక్రాన్‌పల్లికి చెందిన సుంకరి స్రవంతి తన భర్తకు వంశపరపర్యంగా వచ్చిన ఇల్లు శిథిలావస్థకు చేరడంతో కొత్త ఇంటి నిర్మాణం చేపట్టాలని కూల్చివేశారు. నూతన ఇంటి నిర్మాణం కోసం జులై11, 2024 జీపీ నుంచి ఆమె అనుమతి తీసుకున్నారు. కానీ నిబంధనల మేరకు నిర్మాణం జరగడం లేదని, స్లాబు ముందుకు వచ్చిందని వీడీసీ సభ్యులు పనులను అడ్డుకున్నారు. వీడీసీ రూ.30వేలు జరిమానా విధించగా, కట్టేసి పనులు ప్రారంభించారు. అయినా మళ్లీ వీడీసీ ఇబ్బందులకు గురిచేయడంతో బాధిత కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. గతనెలలో వీడీసీపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. నెల రోజులు గడుస్తున్నా వీడీసీ సభ్యులను పోలీసులు అరెస్ట్ చేయకపోవడం పలు విమర్శలకు తావిస్తుంది. బెదిరిపులకు పాల్పడుతూ, కుటుంబంను గ్రామబహిష్కరణ చేస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్న వీడీసీ సభ్యులపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు స్రవంతి ఈనెల 12న ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించారు. అలాగే సెట్ బ్యాక్ లేకుండా, ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆక్రమించుకుని ఇంటి నిర్మాణం చేపట్టారని వీడీసీ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జక్రాన్‌పల్లి జీపీ సెక్రెటరీ స్రవంతి భర్త లింగన్నకు నోటీసులు జారీ చేశారు. ఇంటిని కొలిచి ఇచ్చిన ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించినట్లు నోటీసులో జీపీ సెక్రటరీ పేర్కొన్నారు. దీనిపై బాధితురాలు హైకోర్టును ఆశ్రయించగా స్టే విధించింది. స్పష్టమైన అధారాలతో ఈనెల 28న హాజరు కావాలని రాష్ట్ర పంచాయతీ ప్రిన్సిపల్ సెక్రెటరీ, నిజామాబాద్ కలెక్టర్, జక్రాన్‌పల్లి సెక్రెటరీకి నోటీసులు జారీ చేసింది. దీంతో సదరు జీపీ సెక్రెటరీ నుంచి రాష్ట్ర పంచాయతీ ప్రిన్సిపల్ సెక్రెటరీ వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది.

ఇంటి స్థలంలోనే నిర్మించాం..



ఇంటి నిర్మాణం చేపట్టినప్పటి నుంచి వీడీసీ సభ్యులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇంటి స్థలంలోనే ఇంటిని నిర్మించాం. రోడ్డును ఆక్రమించుకోలేదు. కావాలనే వీడీసీ సభ్యులు ఇంటి నిర్మాణాన్ని కూల్చివేయాలని చూస్తున్నారు. వీరి వేధింపులతో ఆత్మహత్యకు ప్రయత్నం చేశా. అధికారులు స్పందించి న్యాయం చేయాలి -సుంకరి స్రవంతి, జక్రాన్‌పల్లి

పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారు?



మార్కెట్‌యార్డులో పసుపును పరిశీలిస్తున్న అన్వేష్‌రెడ్డి, ముప్ప గంగారెడ్డి, అధికారులు, రైతులు

- పసుపు ధరపై ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డివి అర్థం లేని మాటలు
- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి

సుభాష్‌నగర్: పసుపు ధర విషయంలో ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అర్థం లేకుండా మాట్లాడుతున్నారని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి విమర్శించారు. ధర తగ్గితే పదేళ్లు అధికారంలో ఉండి అప్పుడు మాట్లాడలేదని, ఇప్పుడు ప్లకార్డులు పట్టుకోవడం సిగ్గుచేటన్నారు. నిజామాబాద్ మార్కెట్ యార్డును సోమవారం ఆయన సందర్శించారు. అన్వేష్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రూ.6వేలకు మించి ధర రాలేదని, ఆ సమయంలో ప్రశాంత్‌రెడ్డి, కవిత ఏం చేశారని ప్రశ్నించారు. ధర విషయమై ఎంపీ అర్వింద్ చొరవ తీసుకుని కేంద్ర మంత్రులతో మాట్లాడాలని, ధర నిలకడగా ఉండేలా చూడాలన్నారు. నాఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని, పసుపునకు మద్దతు ధర అంశం కేంద్రం పరిధిలో ఉందని, ఇటీవల కేంద్ర మంత్రులకు లేఖలు రాశానని తెలిపారు. అనంతరం ఆయన అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మార్కెటింగ్‌శాఖ డీడీ మల్లేశం, డీఎంవో గంగుతోపాటు పసుపు రైతులు, వ్యాపారులతో సమావేశమయ్యారు. పసుపు ధర తగ్గడం, నిలకడ లేకపోవడానికి గల కారణాలపై సమీక్షించారు. వ్యాపారులు సిండికేట్ కాకుండా అధికారులు, మార్కెట్ కమిటీ పాలకవర్గం పర్యవేక్షించాలన్నారు. అంతర్జాతీయ మార్కెట్ వల్లే ధరల్లో వ్యత్యాసం ఉందని వ్యాపారులు చెప్పగా, రైతు సంఘాల నాయకులు వ్యతిరేకించారు. కోల్డ్ స్టోరేజీ నిర్మాణంతోపాటు సాంగ్లీ, ఈ-రోడ్ మార్కెట్లను సందర్శించాలని రైతు సంఘాలు ప్రతిపాదించాయి. నాయకులు ప్రభాకర్, దేవరాం, లింగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, డైరెక్టర్లు అగ్గు భోజన్న, నరేందర్, రాజలింగం, మారుతి మల్లేష్ ఉన్నారు.

క్రైం కార్నర్

ఠాణాకు తరలివచ్చిన మహిళలు



బాల్కొండ: మండలంలోని బస్సాపూర్ గ్రామానికి చెందిన కొందరు మహిళలు సోమవారం బాల్కొండ పోలీస్ స్టేషన్‌కు తరలివచ్చారు. తమను గ్రామంలో ఓ కుల సంఘానికి చెందిన కొందరు వ్యక్తులు బూతులు తిడుతున్నారని, అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఎస్సై నరేష్‌కు ఫిర్యాదు చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అత్త ఇంట్లో చోరీకి పాల్పడిన అల్లుడు

- ఈనెల 9న నిజామాబాద్ నగరంలో జరిగిన ఘటన
- నిందితుడిని పట్టుకున్న పోలీసులు

ఖలీల్‌వాడి: అత్త ఇంట్లో అల్లుడు చోరీకి పాల్పడిన ఘటన నిజామాబాద్‌లో చోటుచేసుకుంది. కొన్నిరోజుల క్రితం ఘటన జరుగగా, నిందితుడిని పట్టుకున్నట్లు నాలుగోటౌన్ ఎస్సై శ్రీకాంత్ సోమవారం తెలిపారు. వివరాలు ఇలా.. నగరంలోని రోటరీ నగర్‌కు చెందిన సభావత్ సక్కుబాయి ఈనెల 9న ఉదయం ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లింది. మధ్యాహ్నం ఇంటి తలుపులు తెరిచిఉండటంతో ఇంటి దగ్గర్లోనే ఉన్న ఆమె కూతురు గమనించి సక్కుబాయికి సమాచారం అందించింది. ఆమె ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు ఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలతో పోలీసులు బాధితురాలి అల్లుడు ధరావత్ సంతోష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ చేసినట్లు తెలిపారు. అతని నుంచి సుమారు 8 తులాల బంగారు నగలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన నిజామాబాద్ టౌన్ సీఐ శ్రీనివాస్‌రాజ్, ఎస్సై శ్రీకాంత్, సిబ్బందిని ఏసీపీ రాజావెంకట్ రెడ్డి అభినందించారు.

మద్యంమత్తులో స్నేహితుడిపై గొడ్డలితో దాడి

మాక్లూర్: మద్యం మత్తులో ఇద్దరు స్నేహితుల మధ్య మాటమాట పెరిగి గొడవ జరుగగా, ఒకరు గొడ్డలితో దాడి చేసి స్నేహితుడిని గాయపర్చారు. మండలంలోని కల్లెడి గ్రామంలో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. కల్లెడి గ్రామానికి చెందిన దేవతి పోశెట్టి, తెడ్డు లింగం ఇద్దరు ప్రాణస్నేహితులు. పోశెట్టి 3 నెలల క్రితం దుబాయ్ నుంచి స్వగ్రామం వచ్చాడు. తిరిగి ఈనెల 17న దుబాయ్ వెళ్లాల్సి ఉంది. ఈసందర్భంగా పోశెట్టి, లింగం విందు చేసుకున్నారు. మద్యం మత్తులో పోశెట్టి, లింగంను అనరాని మాట అనడంతో ఆగ్రహంతో గొడ్డలితో దాడి చేసినట్లు తెలుస్తుందని పోలీసులు తెలిపారు. బాధితుడు ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు లింగంను అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు పోలీసులు సోమవారం తెలిపారు.

పాత సీఎస్‌ఐ స్కూల్‌లో అగ్నిప్రమాదం



ఖలీల్‌వాడి: నగరంలోని కంఠేశ్వర్‌లోని పాత సీఎస్‌ఐ స్కూల్‌లో సోమవారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగింది. పాఠశాలలోని స్టోర్‌రూం నుంచి అకస్మాత్తుగా మంటలు రావడంతో స్థానికులు అగ్నిమాపకశాఖ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేసినట్లు అగ్నిమాపకశాఖ అధికారి నర్సింగ్‌రావు తెలిపారు.

బోధన్ రూరల్ సీఐకి మెమో జారీ

ఖలీల్‌వాడి: బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబుపై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సోమవారం సీపీ పోతరాజు సాయిచైతన్య చార్జ్ మెమో అందించారు. ఇటీవల ఎడపల్లి మండలం జానకంపేట లక్ష్మీనరసింహస్వామి జాతరలో బోయి భాగ్య అనే మహిళ పర్సు పోగొట్టుకుంది, దీంతో ఆమె అక్కడే ఉన్న బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబుకు ఫిర్యాదు చేయగా సదరు మహిళను సీఐ విజయ్‌బాబు కొట్టారు. దీనిపై ప్రజావాణిలో కలెక్టర్‌కు, బోధన్ ఏసీపీకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. సీపీ పూర్తిస్థాయి విచారణ జరిపి క్రమశిక్షణ చర్యల్లో భాగంగా చార్జ్ మెమో ఇచ్చారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

మాచారెడ్డి: పాల్వంచ మండల కేంద్రంలోని పేకాట స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేయగా పేకాడుతున్న నలుగురిని పట్టుకున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి రూ.3338 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నస్రుల్లాబాద్‌లో ఒకరి ఆత్మహత్య



శ్రీనివాస్ (ఫైల్)

నస్రుల్లాబాద్(బాన్సువాడ): బాన్సువాడకు చెందిన ఓ వ్యక్తి నస్రుల్లాబాద్ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నస్రుల్లాబాద్ చెరువులో సోమవారం ఓ వ్యక్తి మృతదేహం కనబడటంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు బాన్సువాడ గ్రామానికి చెందిన కొత్తకొండ శ్రీనివాస్(53)గా గుర్తించారు. శ్రీనివాస్ విరిగిన కాలు తీవ్రంగా నొప్పి రావడంతో నిత్యం బాధపడేవాడు. ఈక్రమంలో ఈనెల 14న ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. కాలు నొప్పి భరించలేకనే చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని భార్య అనిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.